క్లుప్తంగా

పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ కార్యవర్గ ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా గుడ్ల శ్రీనివాస్ (సాక్షి) ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా గోపాల్, ఉపాధ్యక్షులుగా నరేశ్, తిరుపతిగౌడ్, కోశాధికారి మల్లేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు, సహాయకార్యదర్శులు మల్లేశ్, తిరుపతి, ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా శంకర్, శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్, తిరుపతి, సాబీర్‌పాషా, సుధాకర్‌గౌడ్, వంశీకృష్ణ, సతీశ్‌రెడ్డి, శ్రీనివాస్ ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు వేణుగోపాల్, రాజశేఖర్, మధుసూదన్ తెలిపారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతూనే ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు చొరవ చూపుతామని అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌ను బలోపేతం చేస్తూనే సభ్యుల గౌరవం పెంచేలా కృషి చేస్తామన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి



పూజలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి సంకష్టహర చతుర్థి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు దేవ్‌ప్రకాశ్ పాండే ఆలయంలోని గణపతి స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. గణపతికి ఇష్టమైన ఉండ్రాళ్లు, గరిక వివిధ రకాల పండ్లు నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, కంపెనీ బృందం

జ్యోతినగర్: ప్రతీఒక్కరు తమకు సంబంధించిన ముఖ్యమైన రోజుల్లో తప్పకుండా ఒక మొక్క నాటడంతో పాటు సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో పనులు నిర్వహిస్తున్న జీవెర్నోవా కంపెనీ ఇన్‌చార్జి ప్రశాంత్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనిలోని దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాలలో గురువారం గ్లోబల్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సేఫ్టీ అధికారి శివసాగర్, హెచ్‌ఎం రేణుక, ఉపాధ్యాయురాలు అనిత, కాంట్రాక్టర్ పసుల ప్రకాశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యపై అవగాహన సదస్సు

రామగుండం: అంతర్గాంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో గురువారం మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్యపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల పరిరక్షణ అధికారి కనకరాజు మాట్లాడుతూ బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరమని, వ్యక్తిగత పరిశుభ్రత, శారీరక, మానసిక ఆరోగ్యాలను మెరుగుపరచడంతోనే విద్యలో ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. బాలికలకు ఏదైనా సమస్య ఎదురైతే 1098 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. విద్యాలయ ప్రత్యేకాధికారి తొటం కల్పన, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ శ్రీనివాస్, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ సంతోష్ ఉన్నారు.

గౌడసంఘం నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని తొగర్రాయి గౌడ సంఘం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా కొత్తకొండ మల్లేశం, ఉపాధ్యక్షుడిగా మామిడి రాజకొమురయ్య, కార్యవర్గ సభ్యులుగా బండారి నర్సయ్య, ఉట్కూరి రాజయ్య, రావుల లచ్చయ్య, వంగ మొండయ్య, బాలసాని సతీశ్, వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొత్కపల్లి, జీలకుంట, శానగొండ గ్రామాల్లో ఏఎస్సై వీరస్వామిగౌడ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. అనుమతి లేని వాహనదారులకు జరిమానా విధించారు.

విద్యార్థులకు బూట్లు, సాక్సులు



విద్యార్థులకు షూ, సాక్సులు అందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ శ్రీహర్ష (ఫైల్)

- కలెక్టర్ ప్రత్యేక చొరవతో సర్కార్ బడి పిల్లలకు అందజేత
- ప్రత్యేక నిధులతో రెండేళ్లుగా పంపిణీ
- కేజీబీవీ, మోడల్‌స్కూల్ విద్యార్థులకు కూడా..

పెద్దపల్లిరూరల్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, క్రమశిక్షణ కలిగి ఉండేలా విద్యాలయాలను తీర్చిదిద్దేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక దృష్టిసారించారు. రాష్ట్రానికే ఆదర్శంగా ఉండేలా ఉపాధ్యాయుల్లో హాజరుశాతం పెంచేలా ఫేస్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్)ను రూపొందించారు కలెక్టర్. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులతో పాటు కేజీబీవీ, మోడల్ పాఠశాలలు, జూనియర్ కాలేజీ విద్యార్థుల్లో ఉత్సాహం నింపేలా.. గతేడాది నుంచి షూ (బూట్లు), సాక్స్‌లు కూడా పంపిణీ చేస్తున్నారు. గతేడాది 12,442 మంది విద్యార్థులకు అందించగా.. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 6489 విద్యార్థులకు పంపిణీ చేసే కార్యక్రమం కొనసాగుతోంది. ఇలాంటి కార్యక్రమం కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో మాత్రమే అమలవుతున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

షూతో పాటు మూడు జతల సాక్సులు..

ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల, కేజీబీవీలో చదివే విద్యార్థులకు షూ, సాక్సులను వారి కాలి సైజును బట్టే కొనుగోలు చేసి అందించారు. బాలురకు 2 నుంచి 10 సైజు షూ, బాలికలకు 3 నుంచి 8 నంబరు సైజు షూ (బూట్లు) తెప్పించారు. సాక్సులు 2, 3, 4, 5, 6తో పాటు ఫ్రీసైజు తెప్పించారు. విద్యార్థులకు షూ జతతోపాటు మూడు జతల సాక్సులు అందించారు.

ప్రత్యేక నిధులతో కొనుగోలు..

కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పాఠశాలకు బూట్లు వేసుకుని వచ్చేలా చూడాలనే ఆలోచనతో ప్రత్యేక నిధులు వెచ్చించి షూ తెప్పించారు. గతేడాది 12,442 మంది విద్యార్థుల కోసం రూ.55.36లక్షలు వెచ్చించారు. అందులో షూల కోసం రూ.42.92లక్షలు, సాక్సుల కోసం రూ.12.44లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులందరికీ అందించేలా రూ.28.87లక్షలతో 6489 విద్యార్థులకు షూ, సాక్సులు అందించారు. ఇందులో రూ.22.38లక్షలతో షూలు, 6.48లక్షలతో సాక్సులు తెప్పించి పంపిణీ చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో బూట్లు వేసుకుని వచ్చి క్రీడాపోటీల్లోనూ పాల్గొంటున్నారు.

పంపిణీ జరుగుతోంది

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బూట్లు, సాక్సులు అందించేందుకు కలెక్టర్ చొరవ చూపారు. ప్రత్యేక నిధులతో షూ, సాక్సులు తెప్పించి విద్యార్థులకు గతేడాది, ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ అందిస్తున్నారు. కాలికి సరిపడా సైజును బట్టి అందుకు తగ్గట్టుగానే షూలు అందిస్తున్నాం. పంపిణీ కొనసాగుతోంది. – అజీముద్దీన్ దబీర్, కోఆర్డినేటర్

‘ప్రభుత్వం, పోలీసుల అత్యుత్సాహం’



మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: రాజకీయ పార్టీలను, ప్రజాప్రతినిధులను సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించే హక్కు ఉందని హైకోర్టు తీర్పు ఇచ్చిన క్రమంలో మంథని నియోజకవర్గంలో పోలీసులు మారాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. గురువారం రాజగృహలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పోలీసుల అరాచకాలు పెరిగిపోతున్నాయని, దుద్దిళ్ల కుటుంబానికి ఎప్పుడు పదవులు వస్తే అప్పుడు వాళ్ల నిజస్వరూపాలను చూపించడం పరిపాటిగా మారిందన్నారు. సోషల్ మీడియా విషయంలో పోలీసులు, ప్రభుత్వం అత్యుత్సాహం చూపుతున్నాయని, ఇప్పటికే అనేక మందిపై కేసులు నమోదు చేశారన్నారు. నేపాల్ పరిస్థితులు ఇక్కడ పునరావృతం కాకుండా పోలీసులు చూడాలన్నారు. రాజ్యాంగం మాత్రమే పోలీసులకు ఉద్యోగాలు ఇచ్చిందని, కాంగ్రెస్ పార్టీ ఇవ్వలేదనే విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, నాయకులు తరగం శంకర్‌లాల్, పుప్పాల తిరుపతి, కనవేన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సింగరేణిలో సొంతింటి పథకం అమలు చేయాలి



ఓటు వేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

గోదావరిఖని: సింగరేణిలో సొంతింటి పథకం అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు గనులపై బ్యాలెట్ ఓటింగ్‌కు శ్రీకారం చుట్టారు. ఆర్జీ–1 ఏరియాలోని అన్ని గనులపై గురువారం బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేసి ఓటింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, నాయకులు వేల్పుల కుమారస్వామి, నామని బిక్షపతి, ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియాలో..

సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని ఆర్జీ–2 ఏరియాలో సీఐటీయూ ఆధ్వర్యంలో బ్యాలెంట్ ఓటింగ్ నిర్వహించారు. సీఐటీయూ ఏరియా నాయకులు పాల్గొన్నారు.

నానో యూరియాతో ప్రయోజనాలు



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ అంజని

మంథని: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతల్లో మార్పు రావాలని, నేల ఆరోగ్య సంరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని మంథని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు అంజని మిశ్రా అన్నారు. మంథనిలో గురువారం నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఎరువుల వినియోగంతో అనర్థాలు పెరుగుతున్న తరుణంలో వాటిని నియంత్రణకు నానో యూరియా వినియోగించాలని సూచించారు. ఒక బస్తా గుళికల యూరియాతో సమానంగా అర లీటరు నానో యూరియా పనిచేస్తుందని పేర్కొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు కోరారు. పెద్దపల్లిలో గురువారం జిల్లా నాలుగో మహాసభ సమావేశం జరిగింది. కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడారు. ఇంటింటా తిరిగి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుని సేవలందిస్తున్న ఆశావర్కర్ల బతుకులు దుర్భరంగా ఉన్నాయన్నారు. ఆశావర్కర్లకు రూ.18వేల వేతనం ఇస్తామంటూ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవాధ్యక్షురాలు జ్యోతి, శారద, రూపారాణి, సువర్ణ, సరోజన, స్వప్న, శివలీల, సునీత, అమృత, విజయ ఉన్నారు.

వృత్తివిద్యా శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందజేస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత ముఖ్య అతిథిగా హాజరై టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, సేవా కోఆర్డినేటింగ్ ఆఫీసర్ హన్మంతరావు, లేడీస్ క్లబ్ సెక్రటరీ శిరీష, ఖాదీ గ్రామోద్యోగ మహా విద్యాలయ కోఆర్డినేటర్ డి.శివకుమార్, సేవాసమితి కోఆర్డినేటర్ తిరుపతి పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధులకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: తెలంగాణ సాయుధ పోరాట యోధులకు సీపీఐ ఆధ్వర్యంలో గురువారం నివాళి అర్పించారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోరాట యోధుల చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాయకులు కె.కనకరాజ్, మాటేటి శంకర్, టి.రమేశ్ కుమార్, గౌస్, పడాల కనకరాజు, ఎర్రల రాజయ్య, లెనిన్ పాల్గొన్నారు.

కాళేశ్వరం ఎస్‌ఈకి సన్మానం



సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

రామగుండం: కాళేశ్వరం రామగుండం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎండీ దస్తగిరిని గురువారం తెలంగాణ మైనార్టీ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.రియాజ్ అలీ, ఎండీ.సిరాజ్, ఎం.ఎ.అజీజ్, ఎండీ.అసద్‌పాషా, నిసార్ అహ్మద్, మసూద్ అలీ, ప్రేమ్‌కుమార్, బ్రహ్మచారి, నళిని, రీతాకుమారి ఉన్నారు.

కాన్షీరాం విగ్రహం వద్ద లైట్ ఏర్పాటు చేయాలి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని జెండా కూడలివద్ద గల కాన్షీరాం విగ్రహం కోసం విద్యుత్ దీపం ఏర్పాటు చేయాలని మాదిగశక్తి వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్, కల్లెపల్లి రవి ఎమ్మెల్యే విజయ రమణారావును కలిసి కోరారు. మండలంలోని రాఘవాపూర్‌లోని సర్వే నంబరు 1072లో జాంబవ చక్రవర్తి విగ్రహం ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇప్పించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సింగరేణి రెస్క్యూకు జాతీయస్థాయిలో గుర్తింపు



మాట్లాడుతున్న డైరెక్టర్ ఎల్‌వీ సూర్యనారాయణ

గోదావరిఖని: సింగరేణి రెస్క్యూకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉందని ఆపరేషన్ డైరెక్టర్ ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం రాత్రి 54వ, జోనల్‌స్థాయి రెస్క్యూ పోటీల ముగింపు సందర్భంగా స్థానిక ఎస్‌సీవోఏ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సంస్థ వ్యాప్తంగా ఆసక్తి ఉన్న యువకార్మికులను రిక్రూట్‌చేసుకుని రెస్క్యూలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రపంచదేశాలకు దీటుగా అత్యాధునిక పరికరాలు వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. సింగరేణిలో అనుభవం ఉన్న ఉద్యోగులు దూరం అవుతున్నారని, వారి అనుభవాన్ని పంచుకుని సంస్థకు వినియోగించుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో మరింత లోతుగా బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉందని దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉందన్నారు. డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, తిరుమల్‌రావు, డీఎంఎస్ అశోక్‌కుమార్, ఉమేశ్‌ఎం సావర్కర్, నాగేశ్వర్‌రావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఆర్జీ–2 జీఎం వెంకటయ్య, రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘పూర్తిస్థాయి పరిహారం చెల్లించకుండానే ఇళ్లు కూల్చివేశారు’



పుట్ట మధుకు వివరిస్తున్న బాధితులు

రామగిరి: సింగరేణి ఓసీపీ విస్తరణలో భాగంగా మండలంలోని లద్నాపూర్ నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించకుండా ఇళ్లు కూల్చివేశారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌కు నిర్వాసితులు మొరపెట్టుకున్నారు. లద్నాపూర్‌లో గురువారం మాజీ సర్పంచ్ బడికెల విజయ శ్రీనివాస్ ఇంటిని, గ్రామానికి చెందిన మరి కొంత మంది ఇళ్లను కూల్చివేయగా వారిని కలిసి వివరాలు తెలుసుకున్నారు. సింగరేణి సంస్థ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తాళం వేసి ఉన్న ఇళ్లను సైతం కూల్చివేస్తోందని వాపోయారు. పరిహారం ఇప్పటి వరకు చెల్లించలేదని బాధితులు పుట్ట మధు దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత సింగరేణి అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని ఆయన తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మండలంలోని రామయ్యపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న దాడి శంకరయ్య, గ్రామానికి చెందిన కాటిపెల్లి సుమన్ ఇటీవల మరణించగా వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. లద్నాపూర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న బర్ల లక్ష్మి, ఆరెల్లి మల్లేశ్వరిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బదిలీ అధికారికి ఆత్మీయ సన్మానం



సన్మానిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో పర్చేస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 ఉపరితల గనికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా గురువారం జీఎం కార్యాలయంలో జీఎం సుధాకరరావు సన్మానించారు. ఏరియా ఇంజనీర్ శేఖర్‌బాబు, ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు వెంకటరమణ, రాజశేఖర్, విభాగాధిపతులు రాజారెడ్డి, రాజేంద్రకుమార్, సుదర్శనం, సురేఖ, జనార్దనరెడ్డి, ఐలయ్య, రాజేశ్వరి, ఉదయ భాస్కర్, మేఘన పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ వినియోగించుకోండి

రామగిరి: సింగరేణి ఆర్జీ–3 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత తేనెటీగల పెంపకంపై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకరరావు సూచించారు. మండలంలోని సెంటినరికాలనీ సీఎస్‌సీఓఏ క్లబ్‌లో సీఎస్సార్ ద్వారా మహిళలకు తేనెటీగల పెంపకంపై గురువారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. తేనెటీగల పెంపకంపై మనబ్ కళ్యాణ్ వెల్ఫేర్, అగర్తల, వెస్ట్ త్రిపుర వారి ద్వారా ఏడురోజుల శిక్షణ, సంబంధిత పరికరాలు అందిస్తామన్నారు. పన్నూరు, రత్నాపూర్, కల్వచర్ల, బేగంపేట్, నవాబ్‌పేట్, నాగేపల్లి, ఆదివారంపేట, లద్నాపూర్‌కు చెందిన మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డీఆర్డీవో కాళిందిని, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీనివాస్, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం, శిక్షకుడు అమన్ పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ



సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఎస్జీఎఫ్ జోనల్ క్రీడల్లో ఐపీఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్ తెలిపారు. వీరిని కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ కృష్ణప్రియ గురువారం అభినందించారు.

విద్యార్థులకు అభినందన



ఎలిగేడు: సుల్తానాబాద్‌లో 8, 9, 10వ తేదీల్లో ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ లెవల్‌లో జరిగిన ఆటల పోటీల్లో మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎంలు దేవేందర్‌రావు, సదయ్య పీడీలు శ్రీకాంత్, ప్రణయ్‌కుమార్ అభినందించారు.

సంక్షిప్త వార్తలు

• సర్టిఫికెట్లు అందజేత

గోదావరిఖని: వోల్వో డంప్‌ట్రక్ డ్రైవింగ్ శిక్షణ పొందిన 50 మంది అభ్యర్థులకు గురువారం ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు.

• 19న ఎన్టీపీసీ స్పందన క్లబ్ ఎన్నికలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని స్పందన క్లబ్ ఎన్నికలు 19న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారితో పాటు ఐదుగురు కమిటీ సభ్యులను ఎన్నికల్లో ఎన్నుకోనున్నారు. స్పందన క్లబ్‌లో 450 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు.

• లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ

పాలకుర్తి: మండలంలోని కొత్తపల్లి, ఈసాలతక్కళ్ళపల్లిలో గురువారం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు, రేషన్‌కార్డుల మంజూరు పత్రాలతో పాటు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలీఠాకూర్, మండల పరిధిలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

• విద్యుత్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేత

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ పరిధి ఒకటో డివిజన్ మేడిపల్లిలో హనుమాన్ గుడి వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌లైన్ మార్చాలని విద్యుత్ అధికారికి కాంగ్రెస్ ఒకటో డివిజన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేశ్ గురువారం వినతిపత్రం అందించారు. డివిజన్ కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి గుర్రాల మల్లేశ్‌యాదవ్ ఉన్నారు.

• బాలల పరిరక్షణపై అవగాహన సదస్సు

కాల్వశ్రీరాంపూర్: మండల కకేంద్రంలోని కేజీబీవీ, మల్యాల మోడల్ స్కూల్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ పెద్దపల్లి–మహిళా సాధికారత కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బాలల పరిరక్షణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఐసీ)నిర్మల ఆడపిల్లల సంరక్షణ, లింగ నిర్ధారణ, బాలల హక్కుల చట్టాలు, బేటీ బచావో, బేటీ పడావో, పోక్సో యాక్ట్, చైల్డ్ హెల్ప్‌లైన్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్స్ శ్రీదేవి, పోచయ్య, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ రమాదేవి, కల్పన, కౌన్సిలర్ వెంకటస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• బైక్‌లు ఢీకొని ఇరువురికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి సమీపంలో గురువారం రాత్రి బైక్‌లు ఢీకొని ఇరువురికి గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం కాల్వశ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హోంగార్డు రాజయ్య విధుల నిమిత్తం బైక్‌పై పెద్దపల్లికి వెళ్లి తిరుగు వస్తుండగా బైక్‌పై వెళ్తున్న పెగడపల్లికి చెందిన నూనేటి సదయ్య ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో హోంగార్డు రాజయ్యకు తీవ్రగాయాలయ్యాయి. సదయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. కాల్వశ్రీరాంపూర్ ఎస్సై వెంకటేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని వారిని చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

• ఆర్థికసాయం అందజేత

జ్యోతినగర్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద బాధితురాలికి శ్రీసీతారామ సేవాసమితి ఆర్థికసాయం అందించింది. ఎన్టీపీసీ రామగుండం ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న కాసుల కమల నిరుపేద గృహిణి. ఇటీవల ఆమె భర్తను కోల్పోయి ఆదరణ లేక ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది. అనారోగ్యంబారిన పడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలిసిన శ్రీసీతారామ సేవాసమితి సభ్యులు గురువారం రూ.5వేలు అందించారు. సేవాసమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ, సభ్యులు కంది సుజాత, పిట్ట లలిత, కొండు రమాదేవి, కట్కూరి శాంతి పాల్గొన్నారు.

• రుణమాఫీ వర్తింపజేయాలి

రామగిరి: ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ తమకు వర్తింపజేయాలని గురువారం కేడీసీసీ చైర్మన్ కోడూరి రవీందర్‌రావుకు రైతులు వినతిపత్రం అందజేశారు. రామగిరి మండలం బేగంపేట కేడీసీసీ బ్యాంకులో 54మంది రైతులకు సంబంధించి రుణమాఫీ జరగలేదని తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు.

• ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి

రామగిరి: తెలంగాణ ఉద్యమంలో కళాకారులు ముందుండి పోరాటం చేశారని, వారికి తగిన గుర్తింపు ఇచ్చి ఆదుకోవాలని కళాకారుడు కొండ్ర వెంకన్న గౌడ్ కోరారు. హైదరాబాద్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెలను గురువారం కలిసి కళాకారుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

• పంచాయతీ కార్మికులు ఉద్యమించాలి

రామగుండం: గ్రామ పంచాయతీ కార్మికులు సంఘటితంగా ఉద్యమిస్తేనే సమస్యల పరిష్కారానికి నోచుకుంటాయని సీఐటీయూ అంతర్గాం మండల కన్వీనర్ అడారి నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో పంచాయతీ కార్మికులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం అంతర్గాం మండల అధ్యక్షుడు పశువుల భీమయ్య, ప్రధాన కార్యదర్శి మాలెం సురేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ తూడూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బాణాల రాజేశ్, కోశాధికారి తమ్మనవేణి శంకర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి రామాచారి, జలపతిరావు, పోశం పాల్గొన్నారు.

• మొక్కలు నాటిన విద్యార్థులు

ధర్మారం: యువశక్తి యూత్ అసోసియేషన్, మై భారత్ పెద్దపల్లి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలో గురువారం అమ్మ పేరున ఒక మొక్కనాటుదాం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యాలయంలోకి వెళ్లే దారిలో ఇరువైపులా యూత్ సభ్యులు, విద్యార్థులు సంయుక్తంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి అందించారు.

• అజోల పెంపకంపై దరఖాస్తు చేసుకోండి

సుల్తానాబాద్: గ్రామాల్లో రైతులు అజోల పెంపకంపై దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో దివ్యదర్శన్ రావు అన్నారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా అజోల పెంపకం చేయాలనుకునేవారు సంబంధిత పంచాయతీ సెక్రటరీ సంప్రదించాలని కోరారు. అజోలా పెంపకం ద్వారా పలు రకాల లాభాలు ఉన్నాయని, అజోలా పెంపకం కోసం ప్రభుత్వం రూ.25వేలు అందిస్తుందన్నారు. ఉపాధి పథకం ద్వారా రైతు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

రామగిరి: మండలంలోని కల్వచర్ల కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు గురువారం సెంటినరికాలనీలో ఇంటింటా తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి రోగాలు దరిచేరవని విద్యార్థులు వివిధ రకాల విన్యాసాలు ప్రదర్శించారు. ప్లాస్టిక్ భూతాన్ని తరమివేయాలని విద్యార్థులతో వేషధారణ చేయించారు. అనంతరం నాగేపల్లి చౌరస్తాలో వినియోగదారులకు నృత్య, పాటల రూపంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించి, బట్ట సంచులు వాడాలని వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు బర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.